# సన్మానం

ఈ కాంతం, కనకం, శరభయ్య, గోపాలరావూ మూరా అంతా చేరి నన్ను మేధావుల జాబితాలోంచి తీసేస్తామంటున్నారట. ఇది చాల అక్రమం. నేను అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మేధావినే. "కమ్యూనిజమంటే నాకెందుకు కడుపుమంట?" అనే శీర్షికను నన్ను రాయమన్నారు. నేను చిత్తురాశాను కూడా. దాన్ని సాపురాసే లోపుగా కిష్టమూర్తి వచ్చి "ఏం భాయ్? ఇక ఊరకుంటే లాభంలేదు. మెరికల్లాటివి నాలుగు పాయింట్లు చెప్పు!" అన్నాడు. బుద్ధిగడ్డితిని నేను రాసిన పాయింట్లన్నీ చెప్పేశా, అతను వాటిని కాస్తా కాగితం మీద పెట్టేసి పత్రిక్కి తనపేర పంపేసుకున్నాడు.

"పోనీలే! ఎవరిపేర పడితేనేం, ప్రచారం కదా ప్రధానం? అని నేను సరిపెట్టుకున్నా" అదంతా కలిసి నాకే ఎదురొస్తుందని ఎట్లా అనుకునేదీ!

"కమ్యూనిజం – కడుపుమంటి శీర్షికకు నువు రాస్తానని ఎందుకు రాయలేదూ" అని శరభయ్య నన్నిప్పుడు నిలవదీసి అడుగుతున్నాడు!

"నేను రాశాను. కాని కిష్టమూర్తి కాజేశాడు" అని చెప్పనా? అసలే ఐకమత్యం ప్రధానం అయిన ఈ క్లిష్ట పరిస్థితుల్లో కీచులాడుకోవటం ఏమన్నా భావ్యంగా ఉంటుందీ? 'వాళ్లకు' అలుసైపోమూ?

నేను రాయలేదన్న సొద్దే అనుకుంటే కిష్టమూర్తిచేత నేనే రాయించానని గోపాలరావు నామీద ఇంకోసొద్దు వేశాడు! అది చూడండి.

కిష్టమూర్తి రాసిన దానిమీద "వాళ్లు" ఎదురు రాస్తూ వెటకారమూ, వేళాకోళమూ చేశారు. చాతకాకుండా రాస్తే చెయ్యరూ? కిష్టమూర్తికి అపఖ్యాతి రావటం కోసం నేను అతనిచేత అది రాయించానట! గోపాలరావు అంటున్నాడు. ఎబ్బెబ్బే ఏం మనుషులు!

ఇంతకూ ఇవన్నీ నైతిక కారణాలు. అసలు కారణం రంగయ్య. ఈ మాట పైకి అన్నానో వేటకుక్కల్లాగా మీద పడుతారు – అసలే రంగయ్యకు ద్రోహం చేశానని ఆడిపోసుకుంటున్నార!

మాటపడవలిసే యోగం వచ్చేసరికి అందరూ ఒక్కసారిగా గతం మరిచిపోయారు

కాబోలు. ఈ కాంతం, కనకం, శరభయ్య, గోపాలరావూ, రంగయ్యను దుమ్మెత్తిపోసిన రోజుల్లో అతన్ని వెనకేసుకొచ్చింది నేనూ! వాళ్లు రంగయ్యను దుమ్మెత్తిపోయటం తప్పనికాదు. మనవాడు, కీర్తి కండూతి ఎక్కువై, "అభ్యుదయం, అభ్యుదయం" అంటూ గంతులేసి కమ్యూనిస్టుల నోళ్లలో తలదూర్చి రైతుకూలీలను గురించీ, వాళ్లు ఓడ్చే చెమట గురించీ ఇంకేమేమిటో గురించీ చెత్తాఖానీ పద్యాలు తెగరాశాడు.

"గుడ్డి కన్ను తెరిచినా, మూసినా ఒకటే! రంగయ్య ఏదో రాసిపోతున్నాడని మనం విచారించవలసిన పనిలేదు. వాడు మనిషి మనవాడే!" అని నేనన్నాను కూడానూ.

తల్లి శిగగయ్యా, ఆమాట కూడా నాకిప్పుడెదురే వచ్చింది! "నన్ను నువు గుడ్డి కన్ను అన్నావుటగా!" అని రంగయ్యే నిలవదీసి అడిగాడు.

"నేను లోగడ రాసిందంతా చెత్త! కమ్యూనిస్టులు నన్ను మభ్యపెట్టి నాచేత ఆ చెత్తంతా రాయించారు! నాకొన్ని కొన్ని రచనలు వాళ్లు పూర్తిగా తిరగరాశారు" అని నువే చెబితివి గదటయ్యా?" అని అడిగాను. ఉన్నమాట అడగరూ...?

అసలు అందాకా దేనికీ? రంగయ్యను వాళ్లనుంచి బయటపడమని సలహా ఇచ్చింది నేగాదూ? కాదనమనూ!

"ఇదేమిటి, రంగయ్యా? పడక పడక నువ్వు వాళ్ల మధ్య పడ్డావేమిటి? ఎన్నికలు వచ్చి పడుతున్నై! బోలెడంత పని ఉంది నీ వల్ల" అని నేనంటే, రంగయ్య ఆలోచించి, "సరే, నేను చెప్పినట్టు ఏర్పాటు చేయించు, బయటికి రావటమెంతసేపులే!" అని రంగయ్య అన్నాడు.

అన్నమాట నిలబెట్టుకున్నాడు కూడా! అంతా సజావుగానే జరిగిపోయింది. "వాళ్లు" అనవలసిన మాటలు, "వాళ్లు" అన్నారు; మనవాడు రాంబాణంలాంటి ప్రకటన తయారుచేసి పత్రికల్లో పారేశాడు. అంతా చక్కగా అనుకున్నట్టు జరిగిపోయింది!

లేకపోతే, నాకు తెలీకడుగుతాను, రంగయ్యకు సాహిత్యమేమిటి? సాహిత్యం మొహం తెలీన ప్రజలు అనుకోవచ్చుగాని, తెలిసినవాణ్ని నేనెట్లా ఒప్పుకుంటానూ? రాజకీయాలంటారూ? భేష్! నేను కాదన్లేదే! రంగయ్య రైటైన మనిషి! రంగయ్య సాహితీపరుడుగా మన పక్షాన లేకపోయెనే అని నేనెన్నడూ దుగ్ధపడలేదే!

అటువంటప్పుడు కాంతం వచ్చి "ఏమోయ్? రంగయ్యకు సన్మానం ఏర్పాటు చేస్తున్నా" అనగానే నాకు బాంబు పేలినట్టుండదూ?

నా చెవులను నేనే నమ్మలేక "ఏం సన్మానం?" అన్నాను.

"ఇంకేం సన్మానం? కవి సన్మానం!" అన్నాడు కాంతం.

"చూడు, కాంతం! రంగయ్య తాను నిన్నటిదాకా రాసిందంతా చెత్త అనీ వాళ్లు మోసగించి రాయించారనీ అనె? ఆ తరవుత ఏమీ రాయకపోయె! ఈ సన్మానం దేనికని ఏర్పాటు చేసినట్టు?" అని అడిగాను.

అడుగనూ! అది తప్పా! రేవు "వాళ్లు" మటుకు అడుగరూ? అప్పుడు బాగుంటుందేం? ఇందుకు నేను "ప్రచ్ఛన్న అభ్యుదయ" వాదినా? మొదటినుంచీ నా ప్రవర్తన "అనుమానాస్పదంగానే ఉందా? కన్యాశుల్కం గురజాడదే అయి ఉంటుందని నేననటం అందుకు సాక్ష్యమా?

ఈ లెక్కన మేధావులగతి ఏమయ్యేట్టు?

***ముద్రణ : అభ్యుదయ, జనవరి 1956***